



కుక్కర్లను ట్రాక్టరులోకి లోడ్ చేయిస్తున్న పోలీసులు

సాధారణంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక ఓటర్లను ప్రభావితం చేసే పంపిణీ కార్యక్రమాలను అభ్యర్థులు చేయకూడదు. కానీ, ఇప్పుడు కోడ్ అమల్లోకి రాలేదు. ఆయన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థీ అంతకంటే కాదు. తన తల్లి జ్ఞాపకార్థం ఓ కార్యక్రమాన్ని నిర్వహించి కుక్కర్లను పంపిణీ చేయాలనుకున్నారు. అది పోలీసులకు నచ్చలేదు. అతను తెచ్చిపెట్టుకున్న 745 కుక్కర్లను స్టేషన్‌కు తీసుకెళ్లిపోయారు. ఆ తెప్పించిన వ్యక్తి టీడీపీ నాయకుడు కావడమే దీనికి కారణంగా తెలుస్తోంది. - చిత్తూరు, ఆంధ్రజ్యోతి

పోలీసుల అత్యుత్సాహం

- తవణంపల్లెలో టీడీపీ నాయకుడి 745 కుక్కర్లు సీజ్
- తన తల్లి సంవత్సరీకానికి పంపిణీ చేయాలని ప్రణాళిక
- ఇంతలోనే తీసుకెళ్లిపోయిన పోలీసులు
- పూతలపట్టు నియోజకవర్గానికి విస్తరిస్తున్న పుంగనూరు సంస్కృతి

తవణంపల్లె మండలం తెల్లగుండ్లపల్లె సర్పంచి మాధవి భర్త, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్ నాయుడు తల్లి మరణించి ఏడాది అవుతోంది. మూడు రోజుల్లో సంవత్సరీకాన్ని నిర్వహించి అందరికీ భోజనాలు పెట్టాలని, హాజరైన వారందరికీ కుక్కర్లు పంపిణీ చేయాలని భావించారు. దీని కోసం రెండు రోజుల కిందట 745 కుక్కర్లను చెన్నై నుంచి కొని తెచ్చుకున్నారు. కుక్కర్ల మీద టీడీపీ లోగోలు, పసుపు రంగు స్టిక్కర్లు వంటివి లేవు. ఈ సమాచారాన్ని అందుకున్న చిత్తూరు వెస్ట్ సీఐ రవి శంకర్‌రెడ్డి, తవణంపల్లె ఎస్ఐ సుధాకర్‌రెడ్డి బుధవారం మోహన్‌నాయుడు ఇంట్లో సోదాలు చేశారు. ఇంటి సమీపంలోని గోడౌన్‌లో ఉన్న కుక్కర్లను స్టేషన్‌కు తరలించారు. అమ్మ జ్ఞాపకార్థం పంపిణీ చేసేందుకు తెచ్చుకున్నానని చెప్పినా పోలీసులు వినకుండా తీసుకెళ్లిపోయారని మోహన్‌నాయుడు ఆవేదన వ్యక్తంచేశారు. కుక్కర్ల మీద పార్టీ ప్రచార స్టిక్కర్లు లేకపోయినా పోలీసులు ఇలా కక్ష సాధించడం దారుణమంటున్నారు.

ఇక్కడా.. పుంగనూరులా!

ఇటీవల పుంగనూరులో బీసీవై అధినేత రామచంద్రయాదవ్ తమ పార్టీ కార్యకర్తలు, పార్టీ వలంటీర్లకు బహుమతిగా అందజేసేందుకు తెప్పించిన గోడ గడియారాలనూ అక్కడి పోలీసులు సీజ్ చేశారు. వీటితో పాటు కర్ణాటక మద్యం ప్యాకెట్లు ఉన్నాయని కేసులు పెట్టిన విషయం తెలిసిందే. పుంగనూరు నియోజకవర్గంలో ప్రతిపక్షాలుఎవరు ఎలాంటి సేవా కార్యక్రమాలు చేసినా.. ఏ వస్తువు పంపిణీ చేయాలన్నా పోలీసులు రంగంలోకి దిగుతారు. వాటన్నింటిని సీజ్ చేస్తారు. తవణంపల్లెలోని కుక్కర్ల సీజ్‌తో.. పుంగనూరు సంస్కృతి పూతలపట్టు నియోజకవర్గానికీ పాకింది.

ఈ పంపిణీల మాటేమిటి?

సంక్రాంతి, దీపావళి వంటి పండుగలకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నియోజకవర్గంలోని ప్రజలకు కానుకలను పంపిణీ చేస్తుంటారు. ఇటీవల ఆయన ప్రతి ఇంటికీ కుక్కర్లను అందజేశారు. చిత్తూరు వైసీపీ ఇన్‌చార్జి విజయానంద రెడ్డి కూడా జనవరి ఒకటో తేదీన పెద్దఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. చిత్తూరు టీడీపీ నేత గురజాల జగన్మోహన్ తన పుట్టినరోజు సందర్భంగా నియోజకవర్గంలోని 50 వేల కుటుంబాలకు సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు. ఎన్నికల కోడ్ రానంతవరకు రాజకీయ నాయకులు, అభ్యర్థులు ఇలాంటి పంపిణీలు చేపట్టడం సర్వసాధారణంగా మారింది. వాళ్లంతా పంపిణీ చేసేటప్పుడు పోలీసులెవ్వరూ వెళ్లి దాడులు చేయలేదు. బిల్లులు అడగలేదు. సామగ్రిని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించలేదు. కానీ, తవణంపల్లె పోలీసులు మాత్రం.. టీడీపీ నేత వ్యక్తగత ఫంక్షన్‌లో పంపిణీకి తెప్పించిన కుక్కర్లను సీజ్ చేయడం విమర్శలకు తావిస్తోంది.



చదువుల తల్లులు

చేతుల్లో వీణ బొమ్మలు.. సరస్వతీదేవి అలంకరణల్లో విద్యార్థినులు చదువుల తల్లులుగా కనిపించారు. వసంత పంచమి సందర్భంగా నగరిలోని సరస్వతీ విజ్ఞాన మందిర్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో వంద మంది విద్యార్థినులు సరస్వతీ దేవి వేషధారణలో అలరించారు. - నగరి



స్పెయిన్ అమ్మాయి.. గుంతూరు అబ్బాయి

ఆండ్రియ.. స్పెయిన్ అమ్మాయి. భాష్యం అఖిల్.. బంగారుపాళ్యం మండలం గుంతూరుకు చెందిన అబ్బాయి. రిటైర్డు డీఎస్‌డీవో సుదర్శన్‌నాయుడు కుమారుడైన ఇతడు జర్మనీలో ఎమ్మెస్సీ చదువుతున్నాడు. అక్కడి యూనివర్సిటీలో యోగా టీచరుగా పనిచేస్తున్న ఆండ్రియాతో పరిచయమైంది. ఆ పరిచయం పెళ్లి పీటల వరకు చేరింది. బుధవారం కాణిపాకంలోని ఆలయంలోని హిందూ సంప్రదాయం ప్రకారం వీరి వివాహం జరిగింది. ఆండ్రియ తల్లిదండ్రులు, బంధువులు హాజరయ్యారు. - బంగారుపాళ్యం

వార్డెన్ సస్పెన్షన్

చిత్తూరు, ఫిబ్రవరి 14: విధినిర్వహణలో అలసత్వం ప్రదర్శించినందుకు పూతలపట్టు మండలం పి.కొత్తకోట ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్ సురేష్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ షన్మోహన్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈనెల 13న ఆ శాఖ డీడీ రాజ్యలక్ష్మి వసతిగృహాన్ని తనిఖీ చేశారు. ఆ సందర్భంగా వార్డెన్‌తో పాటు సిబ్బంది కూడా విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని, మరుగుదొడ్లు సరిగ్గా లేవని ఆమె దృష్టికి వచ్చింది. దీనిపై ఆమె పంపిన నివేదిక మేరకు.. వార్డెన్‌ను సస్పెండ్ చేశారు.

సమస్యల పరిష్కారం కోసం..

నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన



చౌడేపల్లె ఎంపీడీవో కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన

చిత్తూరు, ఫిబ్రవరి 14: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. చిత్తూరులోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నల్లబ్యాడ్జీలు ధరించిన నిరసనలో పాల్గొన్నారు. చౌడేపల్లెఎంపీడీవో కార్యాలయంలో జేఏసీ ఆధ్వర్యాన.. కాణిపాకం జడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు.. పలమనేరు, గంగవరం మండలాల్లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో.. కుప్పం ఆర్టీసీ డిపోవద్ద.. రామకుప్పంలో సచివాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు నిరసన తెలిపారు. చిత్తూరులో జరిగిన నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి తాలూకా యూనిట్ అధ్యక్షుడు భానుప్రకాష్ మాట్లాడుతూ 30శాతం ఫిట్‌మెంట్‌తో 12వ పీఆర్సీని ప్రకటించాలని పలుమార్లు కోరినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సరెండర్ లీవు, జీపీఎఫ్, ఏపీ జీఎల్ఐ, మెడికల్ రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్‌లు సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటిని చెల్లించాలని కోరుతున్నప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించే విషయంలోనూ ప్రభుత్వం నేటికీ స్పష్టత ఇవ్వలేదన్నారు. ఉద్యోగ నియామకాల్లో ఎన్ఆర్ఎం, పార్టుటైమ్, ఫుల్‌టైమ్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగ, ఉపాధ్యాయులుగా నియామకమైన వారిని క్రమబద్ధీకరించాలని డిమాండ్‌చేశారు. ప్రభుత్వం స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించేంత వరకు తమ పోరాటాన్ని ఆపమన్నారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులురెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆ సంఘ నేతలు రఘు, రమణ, చెంగల్రాయమందడి, ప్రదీప్‌కుమార్, రమేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.



చిత్తూరులో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏపీ జేఏసీ నాయకులు

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

● థామస్‌కు చంద్రబాబు దిశా నిర్దేశం

వెదురుకుప్పం, ఫిబ్రవరి 14: 'ఏ సమయంలోనైనా ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి. రా.. కదలిరా విజయవంతమైంది. ఇదే స్ఫూర్తితో గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు ముందుకెళ్లాలి' అని టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ వీఎం థామస్‌కు చంద్రబాబు హితబోధ చేశారు. జీడీనెల్లూరులో పార్టీ స్థితిగతులు, రా.. కదలిరా సక్సెస్, జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వ్యూహరచన తదితర అంశాలపై పార్టీ కేంద్ర కార్యాలయంలో సుమారు గంట పాటు చర్చించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్లాలి, పార్టీ బలోపేతానికి ఇంకా పటిష్ఠంగా చేపట్టాల్సిన వ్యూహాలు తదితర అంశాలను చంద్రబాబు ప్రస్తావించారు. ఐవీఆర్‌ఎస్ సర్వే ఫలితాలపై డాక్టర్ థామస్‌కు సానుకూలంగా ఉందన్న విషయం కూడా చర్చకు వచ్చింది. సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని చంద్రబాబు సూచించారు. జీడీనెల్లూరు రాజకీయ పరిస్థితులపై చంద్రబాబు గంటపాటు సమీక్ష జరిపారని థామస్ తెలిపారు. రా.. కదలిరా విజయవంతమైనందుకు అభినందించారని, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారని చెప్పారు.

విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలను రేకెత్తించాలి

● జిల్లాస్థాయి 'ఇన్‌స్పైర్ మనక్' సమావేశంలో కలెక్టరు



మాట్లాడుతున్న కలెక్టర్ షన్మోహన్

యాదమరి, ఫిబ్రవరి 14: విద్యార్థుల్లో విజ్ఞాన శాస్త్రపరంగా వినూత్న ఆలోచనలను ప్రోత్సహించడం చాలా అవసరమని కలెక్టర్ షన్మోహన్ అన్నారు. యాదమరి మండలం మోర్దానపల్లె వద్ద ఉన్న పీఈఎస్ పాఠశాలలో బుధవారం జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనక్ అవార్డు ప్రాజెక్టు కాంపిటీషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమం 16వ తేది వరకు జరుగుతుందన్నారు. దేశ వ్యాప్తంగా 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో సృజనాత్మకత, వినూత్న ఆలోచనలను అభివృద్ధి పరచడానికి, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే ఈ పథకం లక్ష్యమన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయికి, రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారిని జాతీయ స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకకు కార్యరూపందాల్చుతూ వైజ్ఞానిక ప్రదర్శనలను ప్రదర్శించేందుకు ఈ పోటీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో దేవరాజులు, ఎస్‌ఎస్‌ఏ ఏపీసీ వెంకటరమణారెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ విజయేందర్‌రావు, డీవైఈవో చంద్రశేఖర్, జిల్లా సైన్స్ అధికారి రమణ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిత్తూరులో టీడీపీ ఆశావహుల అభిప్రాయ సేకరణ

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 14: చిత్తూరు అసెంబ్లీకి టీడీపీ నుంచి టిక్కెట్ ఆశిస్తున్న వారితో ఆ పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు మునిరామయ్య బుధవారం మాట్లాడారు. విడి విడిగా వారితో సమావేశమై అభిప్రాయ సేకరణ జరిపారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు జిల్లా పార్టీ కార్యాలయంలో యన వారి అభిప్రాయాలు సేకరించారు. గురజాల జగన్మోహన్, కటారి హేమలత, కాజూరు బాలాజి, సీఆర్ రాజన్‌తో మాట్లాడారు. వారి అభిప్రాయాలు తీసుకున్నారు. కాగా చంద్రప్రకాష్, తేజస్విని అందుబాటులో లేకపోవడంతో గురువారం వారితో మాట్లాడే అవకాశం ఉంది.

అడవిలో తీవ్రగాయంతో దూడ మృతి

● చిరుతే దాడి చేసి చంపిందన్న గ్రామస్తులు

● పేలుడు పదార్థం తిని చనిపోయిందని నిర్ధారించిన అటవీ అధికారులు



మృతి చెందిన దూడ

రామకుప్పం, ఫిబ్రవరి 14: రామకుప్పం మండలం 89పెద్దూరు అటవీప్రాంతం ఉప్పువంక ప్రాంతంలో మంగళవారం సాయంత్రం రవి అనే వ్యక్తికి చెందిన దూడ తీవ్రగాయంతో మృతి చెందింది. మంగళవారం రవికి చెందిన రెండు ఆవులతోపాటు దూడ మేత కోసం ఉప్పువంక అటవీప్రాంతానికి వెళ్లాయి. సాయంత్రం రెండు ఆవులు మాత్రం తిరిగొచ్చాయి, దూడ మాత్రం రాలేదు. బుధవారం ఉదయం రవి స్థానికులతో కలసి గాలించగా అడవిలో తీవ్రగాయంతో మృతిచెందిన దూడను గుర్తించారు. చిరుత దాడిలోనే దూడ చనిపోయి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయమై కుప్పం అటవీ రేంజ్ అధికారి వైసీ రెడ్డిని వివరణ కోరగా దూడ ఏదైనా పేలుడు పదార్థం తిని చనిపోయి ఉంటుందన్నారు. దూడకు అయిన గాయాన్ని బట్టి తాము ఆ నిర్ధారణకు వచ్చామన్నారు. అటవిలో వన్యప్రాణుల వేట కోసం ఎవరైనా పేలుడు పదార్థం ఏర్పాటు చేసి ఉంటారని ఆయన తెలిపారు. ఆ దిశలో తాము విచారణ జరుపుతున్నామన్నారు.

ద్రావిడ వర్సిటీలో జీతాల కోసం ఉద్యోగుల నిరసన



ద్రావిడ వర్సిటీలో నిరసన తెలుపుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

గుడుపల్లె, ఫిబ్రవరి 14: ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ జీతాల కోసం బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...నాలుగు నెలలుగా జీతాలు అందకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. జీతాలు రాక నెలలు గడుస్తున్నా ఎంతో ఓర్పుతో వర్సిటీలో విధులు నిర్వహించామని, అయినా అధికారులు తమకు ఇంత వరకు జీతాలు ఇవ్వలేదన్నారు. జీతాలు అందించే వరకు తాము పరిపాలనా భవనం ఎదుట నిరసన కొనసాగిస్తామని వారు స్పష్టంచేశారు.

కర్ణాటక మద్యం సీజ్: ఇద్దరి అరెస్ట్



నిందితులను మీడియాకు చూపిస్తున్న డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

చిత్తూరు, ఫిబ్రవరి 14: కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తీసుకొస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు పట్టుకున్నారు. వీరి కారుతో పాటు 2400 టెట్రా మద్యం ప్యాకెట్లను సీజ్ చేశారు. ఈ వివరాలను బుధవారం చిత్తూరులోని తాలూకా పోలీసుస్టేషన్ ఆవరణలో ఈస్ట్ సీఐ కుళ్లాయప్ప, తాలూకా ఎస్ఐ ఉమామహేశ్వర్‌రెడ్డితో కలిసి డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి మీడియాకు వివరించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం చిత్తూరు మండలం కన్నికాపురం రైల్వే బ్రిడ్జి సమీపంలో తనిఖీలు చేపట్టామన్నారు. పోలీసులు ఓ కారును ఆపి తనిఖీ చేయగా, వివిధ రకాల బ్రాండ్లకు చెందిన 2400 టెట్రా ప్యాకెట్ల మద్యం దొరికిందన్నారు. దీంతో కారులో ఉన్న జీడీ నెల్లూరు మండలం కొళెపల్లెకు చెందిన తోటి ముద్దుకృష్ణ, ఒగ్గువారిపల్లెకు చెందిన జానకిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. మద్యంతో పాటు కారును సీజ్ చేశామని, వీటి విలువ రూ.15 లక్షలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు.

టీపీకోటలో మూషిక జింక



నాగలాపురం, ఫిబ్రవరి 14 : నాగలాపురం మండల పరిధిలోని టీపీ కోట గ్రామంలో అరుదైన మూషిక జింక (మౌస్ డీర్) దర్శనమిచ్చింది. రెండు రోజులకు మునుపు గ్రామానికి చెందిన షారుక్ అటవీ ప్రాంత సమీపంలోని పొలాల వద్దకు వెళ్తుండగా మూషిక జింక కనిపించింది. కాసేపటి తరువాత అది అడవిలోకి వెళ్లిపోయింది. నల్లమలై అటవీ ప్రాంతాల్లో కన్పించే ఈ మూషిక జింక గతంలో దాసుకుప్పం అటవీ ప్రాంతంలో కనిపించినట్లు సత్యవేడు ఎఫ్ఆర్‌వో జయప్రసాద్ రావు తెలిపారు.







పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న గల్లా కుటుంబీకులు - ఆకట్టుకున్న విద్యార్థుల కళా ప్రదర్శన

పేటమిట్టలో కుంభాభిషేక మహోత్సవాలు

పూతలపట్టు, ఫిబ్రవరి 14: పూతలపట్టు మండలం పేటమిట్ట గ్రామంలో కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు మూడో రోజైన బుధవారం ఘనంగా జరిగాయి. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు గ్రామంతో పాటు ఆలయాల చుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్‌దీపాలంకరణ పలువురిని ఆకట్టుకుంటోంది. బుధవారం వేకువజామున గణపతి వేణుగోపాలస్వామి విగ్రహాలకు పూజలు నిర్వహించారు. బ్రహ్మముహూర్త సమయంలో మహాగణపతి స్వామివారి మూషిక వాహనం విగ్రహ స్థాపన జరిగింది. ఉదయం 8 గంటల నుంచి జరిగిన వేదస్వస్తి ప్రతిష్ఠమూర్తులకు శ్రీరామ సహస్రనామ హవనం, ఆంజనేయ సహస్ర హోమాలు, దర్బారు సేవ, చతుర్వేదస్వస్తి తదితర పూజా కార్యక్రమాల్లో గల్లా రామచంద్రనాయుడు, అరుణకుమారి, జయదేవ్ పాల్గొన్నారు. సాయంత్రం 7 గంటలకు నిర్వహించిన పండరి భజనలు, కోలాటాలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు యువరాజులు నాయుడు, చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గంగారపు గోపి, మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, మాజీ కన్వీనర్ చంద్రమౌళి, నాయకులు చింతగుంపల రజినీ, బీసీ నాయకులు షణ్ముగం, గల్లా కుటుంబసభ్యులతో పాటు ట్రస్టు సభ్యులు గల్లా రామానాయుడు, భానుమూర్తి నాయుడు, స్థానికులు పాల్గొన్నారు. గురువారం ఉదయం 4 గంటల నుంచి విగ్రహప్రతిష్ఠ, అనంతరం సీతారాముల కల్యాణ మహోత్సవం జరగనున్నాయి.

శ్రీకాళహస్తిలో వైసీపీకి ఝలక్...!

● టీడీపీలో చేరిన ముగ్గురు జడ్పీటీసీలు



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన జడ్పీటీసీలు, నాయకులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14: అసమ్మతి నేతలు వైసీపీకి గట్టి షాక్ ఇచ్చారు. ముగ్గురు జడ్పీటీసీలతో పాటు ఓ మాజీ జడ్పీటీసీ అధికార పార్టీకి గుడ్‌బై చెప్పారు.శ్రీకాళహస్తి జడ్పీటీసీ వెంకటసుబ్బారెడ్డి, తొట్టంబేడు జడ్పీటీసీ అర్చన దేవి, ఏర్పేడు జడ్పీటీసీ తిరుమలయ్య, తొట్టంబేడు మాజీ జడ్పీటీసీ వెంకటాచలం, శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన వ్యాపారి హరినాయుడు వైసీపీలో అసంతృప్తితో కొనసాగుతున్నారు. టీడీపీ ఇంచార్జి బొజ్జల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో వారంతా బుధవారం సాయంత్రం మంగళగిరిలో ప్రత్యక్షమయ్యారు.టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరారు. ఒక్కసారిగా నలుగురు కీలక నేతలు అధికార పార్టీని వీడడంతో టీడీపీలో కొత్త జోష్ నెలకొంది. ఏకగ్రీవంగా ఎన్నికైన నేతలు కూడా వెళ్లిపోవడంతో వైసీపీలో అంతర్మథనం మొదలైంది.త్వరలోనే పెద్దసంఖ్యలో ఎంపీటీసీలు, సర్పంచులు వైసీపీని వీడి టీడీపీలో చేరనున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. కాగా శ్రీకాళహస్తి వైసీపీలో అసమ్మతి కలవరం మొదలైందని తొమ్మిది నెలల ముందే ఆంధ్రజ్యోతి చెప్పింది.గత ఏడాది మే 8వ తేది బొజ్జల నివాసంలో జరిగిన మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు బొజ్జల హరినాథ రెడ్డి తొలి వర్ధంతి నాడు పలువురు వైసీపీ కీలక నాయకులు బొజ్జల సోదరులకు ఘనంగా నివాళులర్పించారు.తరువాత బొజ్జల కుటుంబంతో చాలా సేపు భేటీ అయ్యారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమవడంతో తమ పార్టీలో ఎలాంటి అసమ్మతి లేదని వైసీపీ చెప్పుకుంది. ఆ రోజు ఆంధ్రజ్యోతి ప్రస్తావించిన పేర్లలో ఇద్దరు తప్ప దాదాపు అందరూ బుధవారం టీడీపీలో చేరిపోవడం గమనార్హం.

కాణిపాక ఆలయానికి వేలాల ద్వారా రూ.84.45 లక్షల ఆదాయం

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 14: కాణిపాక వినాయక స్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన బహిరంగ వేలాలు, సీల్, ఆన్‌లైన్ టెండర్ల ద్వారా 84,45,400 ఆదాయం చేకూరినట్లు చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు తెలిపారు. ఆలయ కార్యాలయ భవనం వద్ద పలు టెండర్లు నిర్వహించారు. ఆలయం వద్ద సెల్‌ఫోన్లు, కెమెరాలు భద్రపరచుకునేందుకు రూ.47,00,400.. శివాలయం పరిసరాలు, పార్కువద్ద ఫొటోలు తీసే హక్కు కోసం రూ.18,05,000.. డార్మెటరీహాల్ వద్ద బంకు నిర్వహణకు రూ.4,10,000.. మూల విరాట్ పాలాభిషేకానికి పాల సరఫరాకు రూ.6,15,000.. బస్టాండు వద్ద బంకు నిర్వహణకు రూ. 9,15,000 చొప్పున హెచ్చుపాటదారులు హక్కులు పొందారు. వీరికి ఏడాది కాలపరిమితి ఉంటుంది. ఈ కార్యక్రమంలో ఏఈవోలు హరిమాధవరెడ్డి, రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, ఏసీ కార్యాలయ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం నాయుడు, టెండర్ దారులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు ప్రత్యేక బ్యాంకు అకౌంట్ తప్పనిసరి



రాజకీయపార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 14: త్వరలో జరిగే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ వేసే ముందే ప్రత్యేక బ్యాంకు అకౌంట్, చెక్‌బుక్ కలిగివుండాలని జేసీ శ్రీనివాసులు అన్నారు. ఎన్నికల్లో వీరు చేసే ఖర్చులకోసం ఇది తప్పనిసరన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. పోలింగ్ కేంద్రాల స్థానాలు, వాటి పేరుపై సవరణలు ఉంటే సంబంధిత ఈఆర్వోలకు ప్రతిపాదనలు అందజేయాలని సూచించారు. ప్రతి 1500 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశించిందని, ఆ మేరకు ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. ఎన్నికల ప్రక్రియకు అవసరమైన అధికారుల నియామకాలు జరిగాయన్నారు. సమావేశంలో పార్టీల ప్రతినిధులు ప్రభుతేజ (టీడీపీ), భాస్కర్, పరదేశి (కాంగ్రెస్), గంగరాజు (సీపీఎం), ఉదయ్‌కుమార్ (వైసీపీ), భాస్కర్ (బీఎస్పీ), ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.





ఆస్థాన మండపంలో హోమం నిర్వహిస్తున్న అర్చక, పండితులు - సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న తల్లిదండ్రులు

కాణిపాకంలో సామూహిక అక్షరాభ్యాసం



ఐరాల(కాణిపాకం): ఫిబ్రవరి 14: వసంతపంచమి సందర్భంగా బుధవారం కాణిపాక క్షేత్రంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ప్రధాన ఆలయంలో స్వామికి అభిషేకం నిర్వహించి వరసిద్ధుడి ఉత్సవమూర్తి, సరస్వతి విగ్రహాన్ని చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు,ఆలయ అధికారులు, సిబ్బంది ఆస్థాన మండపానికి తీసుకొచ్చారు. వేద పండితుల మంత్ర ఘోష నడుమ వినాయక స్వామి, సరస్వతీదేవి ఉత్సవర్లకు పూజలు నిర్వహించారు. పలకలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విద్యార్థుల చేత పలక, బలపం పట్టించి ఓనమాలు దిద్దించారు. జిల్లాలో ప్రతి విద్యార్థి చక్కగా చదివి ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులు కావాలని అందరూ ఆకాంక్షించారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ

కాణిపాక వినాయక స్వామి ఆలయం బుధవారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. వసంత పంచమి సందర్భంగా వేలాదిగా భక్తులు తరలివచ్చారు. స్వామి దర్శనానికి సుమారుమూడు గంటల సమయం పట్టింది.









గాయపడిన మనోహర రెడ్డి - ఏనుగు దాడిలో ధ్వంసమైన మంచం - వరి పంటను తొక్కుకొంటూ వచ్చిన ఏనుగు - కాకర్లవారిపల్లె సమీపంలో ఏనుగులు

రైతుపై గజదాడి

చంద్రగిరి, ఫిబ్రవరి 14: చంద్రగిరి మండలం, చిన్నరామాపురం పంచాయతీలోని యల్లంపల్లెలో పంట పొలాలను ధ్వంసం చేసిన ఏనుగులు ఓ రైతుపై దాడి చేశాయి.20 రోజులకు పైగా మూలపల్లి, భీమవరం, చిన్న రామాపురం, శేషాపురం అటవీ ప్రాంతంలో పంట పొలాలను ఏనుగులు ధ్వంసం చేస్తున్న విషయం తెలిసిందే.మంగళవారం రాత్రి యల్లంపల్లెకు చెందిన మనోహర్‌రెడ్డి తన పొలం వద్ద మంచంపై నిద్రిస్తుండగా ఏనుగులు దాడి చేశాయి.రైతు మనోహర రెడ్డి కేకలు వేయడంతో గ్రామస్థులు అటవీశాఖకు సమాచారం ఇచ్చారు. అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని బాణాసంచి కాల్చి ఏనుగును అటవీ ప్రాంతంలోకి తరిమారు.గాయపడిన మనోహర రెడ్డిని మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. కాగా ఏనుగు దాడిలో గాయపడిన మనోహరరెడ్డిని బుధవారం చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పరామర్శించారు.

కాకర్లవారిపల్లె పొలాలపై ఏనుగుల దాడి

పాకాల: పాకాల మండలం దామలచెరువు పంచాయతీ కాకర్లవారిపల్లె సమీపంలో పంట పొలాలపై బుధవారం రాత్రి ఏనుగులు దాడి చేశాయి. ఐరాల మండలం చుక్కావారిపల్లె సమీపంలో కూడా పంటపొలాలను ఏనుగులు ధ్వంసం చేశాయి.

పోలీసు సంక్షేమమూ ముఖ్యమే : ఎస్పీ



చిత్తూరు, ఫిబ్రవరి 14: పోలీసులు తమ విధులను సక్రమంగా నిర్వహించే విధంగా చూడటమే కాకుండా.. వారి సంక్షేమాన్ని చూడటం కూడా తనకు ముఖ్యమేనని ఎస్పీ జాషువా అన్నారు. బుధవారం ఆయన జిల్లా పోలీసు అతిథి గృహంలో సాయుధ పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. ఏఆర్ విభాగం క్రమశిక్షణకు మారుపేరని, ఎలాంటి చెడు అలవాట్లకు లోనుకాకుండా విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరగడానికి సాయుధ పోలీసుల సహకారం ఎంతో అవసరమన్నారు. అంతకుముందు ఏఆర్ పోలీసు అధికారులు, సిబ్బందిని పరిచయం చేసుకుని వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ అరీఫుల్లా, ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ ఇలియాస్ బాషా, ఎస్‌బీ సీఐ గంగిరెడ్డి, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్ఐలు పాల్గొన్నారు.

ఎస్వీ జూపార్కుకు రెండు బెంగాల్ పులులు



తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 14: తిరుపతిలోని ఎస్వీ జూపార్కుకు కొత్తగా రెండు బెంగాల్ టైగర్స్ వచ్చాయి. జంతు మార్పిడి కార్యక్రమంలో భాగంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలోని నవాబ్ వాజాద్ అలీషా ప్రాగ్రి ఉద్యానవనం నుంచి రెండున్నర సంవత్సరాల వయసు గల ఒక మగ పులి, ఎనిమిదన్నర సంవత్సరాల వయసున్న ఆడపులిని తిరుపతికి తీసుకువచ్చినట్లు జూ క్యూరేటర్ సెల్వం తెలిపారు. పులుల కొత్త జాతులను పెంపొందించాలనే ఉద్దేశంతో వీటిని తీసుకువచ్చామన్నారు. రెండు వారాల పాటు క్వారంటైన్‌లో ఉంచి తరువాత ప్రజల సందర్శనార్థం ఎన్‌క్లోజర్‌లో వదలడం జరుగుతుందని తెలిపారు. కాగా ఇప్పటికే జూలో 5 బెంగాల్ టైగర్స్ వున్న విషయం తెలిసిందే.

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

పలమనేరు అభ్యర్థి వెంకటేగౌడనే

- ఎంపీ మిథున్ రెడ్డి



మహిళా సంఘాలకు చెక్ అందజేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి తదితరులు

పలమనేరు, ఫిబ్రవరి14 : పలమనేరు అసెంబ్లీ స్థానానికి వైసీపీ నుంచి వెంకటేగౌడ పోటీ చేస్తారని మిథున్‌రెడ్డి ప్రకటించారు. బుధవారం పలమనేరులో మెప్మా ఏర్పాటుచేసిన ఆసరా తుది విడత పంపిణీలో పాల్గొన్న మిథున్‌రెడ్డి మాట్లాడుతూ పేదల కష్టం తెలిసిన వ్యక్తి వెంకటేగౌడ అన్నారు. పలమనేరులో 6732 మందికి ఎస్‌హెచ్‌జీ మహిళలకు రూ. 30.85 కోట్ల రుణాలను మూడు విడతల్లో రూ.23.14 కోట్లు జమచేయగా నాల్గవ విడతలో నేడు రూ.7.71 కోట్లు జమ చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఆర్డీఓ మనోజ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పవిత్ర, పలమనేరు మార్కెట్ కమిటీ అధ్యక్షుడు హేమంత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



పలమనేరు, ఫిబ్రవరి14: పలమనేరు మున్సిపాలిటీలోని 248, 246, 262, 263 పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లకు బుధవారం ఈవీఎంలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి ఖాదర్ మొహిద్దీన్, సెక్టోరల్ అధికారులు, బూత్‌లెవెల్ అధికారులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఓటర్లు పాల్గొన్నారు.

సోమల : ప్రతి ఓటరు ఈవీఎంల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ నాగరాజ అన్నారు. బుధవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో వెలుగు మండల సమాఖ్య సభ్యులకు, గ్రూపు సభ్యులకు అవగాహన కల్పించారు. ఓటరు నమోదు, పోలింగ్ కేంద్రాల్లో ఓటు వినియోగం ఆవశ్యకతను, బీఎల్వోల విధులు వివరించారు. కార్యక్రమంలో డీటీలు శ్యాంప్రసాద్‌రెడ్డి, రాము, ఏవో సుధాకర్, ఏపీఎం శివ సీసీలు గంగోజీ, నరసింహులు, సంఘమిత్రలు పాల్గొన్నారు. అలాగే పెద్దఉప్పరపల్లె, నంజంపేట, ఆవులపల్లె, అన్నెమ్మగారిపల్లె పంచాయతీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ నాగరాజ సిబ్బందితో కలసి పరిశీలించారు.

లక్ష మెజారిటీయే లక్ష్యం కావాలి



ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

కుప్పం రూరల్, ఫిబ్రవరి 14: కుప్పంలో చంద్రబాబుకు లక్ష మెజారిటీ లక్ష్యంగా ఓట్లు వేసి గెలిపించాలని టీడీపీ నాయకులు ప్రజలను కోరారు. కుప్పం మండలం మంకలదొడ్డి పంచాయతీలో టీడీపీ వన్నెకుల క్షత్రియ నాయకులు ప్రజలను కలిసి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ నియోకవర్గ యువత అధ్యక్షుడు డి.సతీశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రామమూర్తి, ప్రకాశ్, ఈశ్వర్, పన్నీరు, పళని, రాజశేఖర్, గణపతి, సురేశ్, గణేశ్‌కుమార్, వినోద్, బాబు, ప్రశాంత్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పుల్వామా అమరవీరుల సేవలు చిరస్మరణీయం



కల్లూరులో పుల్వామా అమరవీరులకు నివాళి

కల్లూరు, ఫిబ్రవరి 14: పుల్వామా అమరవీరుల సేవలు చిరస్మరణీయమని జిల్లా లయన్స్‌క్లబ్ క్రీడావిభాగం అధ్యక్షుడు మహమ్మదాలీ తెలిపారు. కల్లూరు పట్టణంలో బుధవారం కల్లూరు లయన్స్‌క్లబ్, లియో క్లబ్ ఆధ్వర్యంలో వీఆర్‌ఆర్ కళాశాల ఆవరణలో పుల్వామా ప్రాంతంలో జరిగిన ఉగ్రవాదుల దాడిలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు వీరమరణం పొంది నేటికి ఐదేళ్లు కావడంపై అమరులకు ఘన నివాళి అర్పించారు. అమరువీరులకు కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. అమరవీరుల త్యాగాలు మరువలేనివని కొనియాడారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లియో క్లబ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మె కాలానికీ జీతాలివ్వాలి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి14: అంగన్వాడీ కార్యకర్తల సమ్మె కాలానికి వేతనాలు ఇవ్వాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు గంగరాజు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద జరిగిన అంగన్వాడీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసీడీఎస్‌కి బడ్జెట్ నిధులు తగ్గించడం దారుణమన్నారు. శిశుమరణాల రేటు తప్పించడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాల్సింది పోయి నిర్వీర్యం చేయటం ఏమిటని ప్రశ్నించారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలను ప్రభుత్వాలు నియంత్రించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. గౌరవాధ్యక్షురాలిగా పద్మ, అధ్యక్షురాలిగా కల్పన, కార్యదర్శిగా లీలావతి, కోశాధికారిగా చంద్రావతిని ఎన్నుకున్నట్లు తెలిపారు.

సేవాలాల్ మహారాజ్ జయంతిని జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గిరిజనసంఘ నాయకులు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి14: బంజారుల ఆరాధ్యదైవం సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు మండలంలోని ఏడు తాండాల ప్రజలు తరలిరావాలని సంఘనాయకులు పిలుపునిచ్చారు. బుధవారం బంజారా సంఘ నాయకులు మాట్లాడుతూ గురువారం సేవాలాల్ మహారాజ్ 285 జయంతి సందర్భంగా పుంగనూరు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి, అన్నదాన కార్యక్రమం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఫైడే ఈశ్వర్‌నాయక్, మూడేరెడ్డి నాయక్, బాణావత్ రాజునాయక్, మనీనాయక్, శంకర్‌నాయక్, భానునాయక్, శ్రీరాములునాయక్, ప్రభాకర్‌నాయక్, కృష్ణానాయక్, గణేశ్‌నాయక్, నాగేనాయక్, మునీంద్రనాయక్, వాసునాయక్, రమణ, మునిరామ్ నాయక్‌లు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



గుడుపల్లె, ఫిబ్రవరి 14: మండలంలోని శెట్టిపల్లె, పీబీ వాడ గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు సుమారు 30మంది బుధవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఉండవల్లిలోని టీడీపీ అధినేత చంద్రబాబు నివాసంలో పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మండలాధ్యక్షుడు బాబునాయుడు, కాణిపాకం వెంకటేశ్, శెటిపల్లె సర్పంచ్ రీటా ఎల్లప్ప, నియోజికవర్గ యువత అధ్యక్షులు వెంకటేశు, మాజీ సర్పంచ్ నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు బోయకొండ వనం ప్రారంభం

చౌడేపల్లె : బోయకొండలో నూతనంగా నిర్మించిన వనాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం ప్రారంభించనున్నట్లు వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ అటవీ శాఖ ఆధ్వర్యంలో రూ.3 కోట్లతో బోయకొండ కింద నూతనంగా వనం నిర్మించినట్లు ఆయన తెలిపారు.

టీడీపీ పాలనలో జరిగిన అభివృద్ధిని చాటిచెప్పాలి

మాజీ సీఎం చంద్రబాబు పీఏ మనోహర్



పార్టీ శ్రేణులనుద్దేశించి మాట్లాడుతున్న మనోహర్

రామకుప్పం, ఫిబ్రవరి 14: కుప్పం నియోజకవర్గంలో టీడీపీ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు చాటిచెప్పాలని మాజీ సీఎం చంద్రబాబు పీఏ మనోహర్ పార్టీ శ్రేణులను కోరారు. అనారోగ్యానికి గురై కోలుకున్న మనోహర్ సుదీర్ఘకాలం తర్వాత రామకుప్పం టీడీపీ కార్యాలయం వచ్చిన సందర్భంగా పార్టీ నేతలు, శ్రేణులు ఆయనకు ఘనస్వాగతం పలికి, సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాల క్రితం కుప్పం ప్రాంతం ఎలా ఉండేదో, టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎలా అభివృద్ధి చెందిందో నేటి యువతకు వివరించాలన్నారు. టీడీపీ పాలనలో జరిగిన అభివృద్ధిని, వైసీపీ పాలనలో జరిగిన అరాచకాలు, అక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ టీడీపీకి అండగా నిలిచి, రానున్న ఎన్నికల్లో చంద్రబాబును లక్ష మెజారిటీతో గెలిపించేలా అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పట్టనారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, నేతలు రామమూర్తి, గంట్లప్పగౌడు, రామకృష్ణప్ప, మహ్మద్‌రఫీ, జయశంకర్, కృష్ణానాయక్, నాగభూషణం, మనోహర్, సత్తి, వెంకటరమణ, విజయ్‌కుమార్‌రెడ్డి, బాలరాజు, మంజునాథ్, జ్ఞానశేఖర్‌రెడ్డి, పెరుమాళ్, లోకేష్, ఆదిల్, రామలింగారెడ్డి, కేశవరెడ్డి, సురేష్, హనుమంతు, శ్రీనివాసులు, అలివేలుమంగమ్మ, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మనోహర్ స్థానిక నేతలతో కలిసి పోలీస్‌స్టేషనుకు వెళ్ళి టీడీపీ చేపట్టిన వివిధ నిరసన కార్యక్రమాల్లోన్న తనపై నమోదైన పలు కేసులకు సంబంధించి ఆయన 41 నోటీసులను స్వీకరించారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి



కుప్పం డిపో ఎదుట నిరసన తెలుపుతున్న ఎన్ఎంయూ నేతలు

కుప్పం,ఫిబ్రవరి14: ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎ.వేలు, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంజీ ప్రసాద్‌కుమార్, కార్యదర్శి ఇ.జయపాల్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయం మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో భాగంగా కుప్పం డిపో ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి ఉద్యోగులు, కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ పీఆర్సీలో ఐఆర్ 30 శాతం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని నెట్వర్క్ ఆసుపత్రుల్లో ఈహెచ్ఎస్ కార్డు ద్వారా నగదు రహిత వైద్య అందించాలని, సీపీఎస్, జీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని, ప్రతినెలా 1వ తేదీన వేతనాలు, పెన్షన్లు ఇవ్వాలని, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు వెంటనే రిటైర్మెంట్స్ బెనిఫిట్స్ ఇవ్వాలని, సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు పారదర్శకంగా ఉండాలని కోరారు. అలాగే ఆర్టీసీ సంస్థలో ఐడీ యాక్ట్‌ను అమలు చేయాలని, అన్‌ఫిట్ అయిన డ్రైవర్లకు ఆర్టీసీ నిబంధనల ప్రకారం ప్రత్యామ్నాయ ఉద్యోగం లేదా అడిషనల్ మానిటర్ బెనిఫిట్ సౌకర్యం కల్పించాలని, ఆర్టీసీ నిబంధనల ప్రకారం అన్ని క్యాటగిరీలలో 2011 నామ్స్ ప్రకారం పదోన్నతులు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని కేసులు పరిష్కరించాలని, 2016కు ముందు చనిపోయిన ఉద్యోగుల వారసులకు ఆర్టీసీ నిబంధనల మేరకు ఎక్కడ చదువుకున్నా కారుణ్య నియామకాలు జరిపి, ఉద్యోగ భృతి చెల్లించాలని, డ్రైవర్లతోపాటు అన్ని క్యాటగిరీలలో ఏర్పడ్డ ఖాళీలను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దిలీప్ కుమార్, ఎంసీ.నాయక్, జయశంకర్, పి.బాష, మాణిక్యం, జేవీ.రమణ, కేఎల్ఎస్.శెట్టి, యువరాజు, ఎన్.వెంకటేశ్ పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

పలమనేరు, ఫిబ్రవరి14 : రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు బుధవారం పలమనేరు నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ పలమనేరు చైర్మన్ ఆనంద్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగులకు దాదాపు రూ.25వేల కోట్లు చెల్లించకపోవడం వలన ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పీఆర్సీ గడువు పూర్తయినా కూడా కనీసం మధ్యంతర భృతి ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. ఉద్యోగులు దాచుకొన్న జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ సొమ్ములను కూడా తిరిగి చెల్లించక పోవడం, కరువు భత్యం రెండు విడతలు విడుదల చేయకపోవడం, సీపీఎస్ కోసం జీతాలు నుంచి మినహాయించిన ఉద్యోగుల సొమ్మును ఖాతాలలో జమచేయకపోవడం, సరండర్ లీవులు ఆపివేయడం లాంటివి ఇబ్బందులపాలు చేశాయన్నారు. ఏఒక్క సమస్యను పరిష్కరించకపోగా తరచూ వాయిదాలను తేదీలను మార్చుతూ ఉద్యోగులను మభ్యపెట్టడం సరికాదన్నారు. ఇకనైనా ప్రభుత్వం వెంటనే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండు చేశారు.

రామకుప్పం : మండల సచివాలయంలో తహసీల్దారు శ్రీధర్, ఎంపీడీఓ కార్యాలయ పరిపాలనాధికారి జయచంద్రనాయుడు అధ్వర్యంలో వివిధ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. మండల జేఏసీ నేతలు తమ ప్రభుత్వ తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు ఆనంద్, రమేష్, శంకర్, యువరాజు పాల్గొన్నారు.

చౌడేపల్లె : ఏపీ జేఏసీ సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోసం ఎంపీడీవో కార్యాలయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. పీఎఫ్, డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని, పీఆర్సీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరైన ఉద్యోగులు

మహిళలకు అండగా టీడీపీ

రామకుప్పం, ఫిబ్రవరి 14: రాష్ట్రంలో మహిళలకు ఎప్పుడూ అండగా నిలిచింది టీడీపీయేనని తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు పద్మమ్మ, మహిళా క్లస్టర్ ఇన్‌చార్జి అలివేలుమంగమ్మ తెలిపారు. బుధవారం వారు పంద్యాల మడుగు, ఎస్.గొల్లపల్లెల్లో జరిగిన మహిళా గృహసారథుల సమావేశాల్లో వారు మాట్లాడుతూ మహిళలకు పొదుపు సంఘాలు ఏర్పాటు ద్వారా ఆర్థిక స్వావలంబన, ఉచితంగా దీపం గ్యాస్ కనెక్షన్లు, సబ్సిడీతో కుట్టుమిషన్లు అందించిన ఘనత టీడీపీకే దక్కిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, మహిళా సంక్షేమాన్ని పాలకులు గాలికొదిలేశారన్నారు. ఈ పరిస్థితులను గుర్తించిన టీడీపీ అధినేత చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలు వర్తింపజేస్తామని ప్రకటించారన్నారు. మహిళా గృహసారథులు ఇంటింటా తిరిగి ఈ కార్యక్రమాలను మహిళలకు వివరించి, ప్రతి ఒక్కరూ టీడీపీకి ఓటేసేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, మాజీ సర్పంచు గంట్లప్పగౌడు, నేతలు చంద్రశేఖర్‌రెడ్డి, రమణ, పృథ్వీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సోలార్ ప్రాజెక్టు ప్రారంభం

పుంగనూరు, ఫిబ్రవరి14: పట్టణ సమీపం పుంగమ్మ చెరువులోని సమ్మర్ స్టోరేజి వద్ద నిర్మించిన సోలార్ ప్రాజెక్టును గురువారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డిలు తెలిపారు. బుధవారం సోలార్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ పరిధిలో విద్యుత్ వినియోగాన్ని తగ్గించేందుకు మంత్రి పెద్దిరెడ్డి సూచనలతో దాదాపు రూ. 6కోట్లతో సోలార్ ప్రాజెక్టును నిర్మిస్తున్నట్లు తెలిపారు. దీంతో మున్సిపాలిటీ ప్రతినెలా రూ. 30లక్షలు విద్యుత్ చార్జీలు చెల్లించేవారమని, ప్రస్తుతం విద్యుత్ చార్జీలు మున్సిపాలిటీకి మిగులుతాయన్నారు. పట్టణంలోని శాంతినగర్ పరిధిలో ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ మహేశ్, జనపద కళల సంస్థ రాష్ట్ర చైర్మన్ నాగభూషణం, కౌన్సిలర్లు నరసింహులు, అమ్ము, బోయకొండ ఆలయ కమిటీ సభ్యుడు రాజేష్ పాల్గొన్నారు.



సోలార్ ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

రేపటి నుంచి సోమలలో చల్లాబాబు పర్యటన

రొంపిచెర్ల, ఫిబ్రవరి 14: ఈనెల 16వ తేదీ నుంచి మూడురోజులపాటు సోమల మండలంలో ఇంటింటి పర్యటన ఉంటుందని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. పెద్దఉప్పరపల్లె నుంచి ప్రారంభించి బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీపై ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. టీడీపీ కుటుంబసభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పరమహంస విద్యాలయంలో వసంత పంచమి



శాంతిపురం, ఫిబ్రవరి 14: మండల పరిధిలోని పరమహంస యోగానంద విద్యాలయంలో బుధవారం వసంత పంచమి ఘనంగా నిర్వహించారు. సరస్వతి పూజ చేయించి ఆ తరువాత గోపూజ నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా పాల్గొన్న విద్యాలయ చైర్మన్‌లు గోపాల్ అగర్వల్, రేణు అగర్వాల్‌లు వసంత పంచమి గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అజాద్ హుస్సేన్, కరస్పాండెంట్ రాధాకృష్ణన్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు టమోటా సాగుపై రైతులకు అవగాహన

సోమల, ఫిబ్రవరి14: పుంగనూరు నియోజకవర్గంలోని టమోటా రైతులకు బెంగళూరు ఐఐహెచ్‌ఆర్ శాస్త్రవేత్తలతో గురువారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఉద్యానాధికారి సంతోషికుమారి తెలిపారు. చౌడేపల్లె మండలం పొదలపల్లె వద్ద మోహన్‌రెడ్డి టమోటా నర్సరీ సమీపంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. టమోటా పంట సాగులో ఉన్న సమస్యలను చర్చించి రైతులకు పలు సూచనలు సలహాలు ఇవ్వనున్నట్లు చెప్పారు.

తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి14: తల్లిదండ్రులు మందలించారని ఓ విద్యార్థి యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పుంగనూరు మండలంలో బుధవారం చోటుచేసుకుంది. మండలంలోని మంగళంకు చెందిన వెంకటరమణ కుమార్తె చందన పుంగనూరు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. ఈనేపథ్యంలో కుమార్తె సక్రమంగా చదవలేదని మందలించడంతో యాసిడ్ తాగి పడిపోవడంతో కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.

అబ్దుల్‌కలాం విగ్రహ ప్రతిష్ఠకు రావాలని కేంద్ర మంత్రికి ఆహ్వానం



పుంగనూరు, ఫిబ్రవరి14: పుంగనూరులో మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం విగ్రహ ప్రతిష్ఠకు రావాలని కేంద్ర మైనార్టీ శాఖ మంత్రి జాన్‌బార్లాను అబ్దుల్‌కలాం ట్రస్ట్ వ్యవస్థాకుడు అయూబ్‌ఖాన్ బుధవారం డిల్లీలో కలిసినట్లు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రతిష్ఠను ప్రపంచ వ్యాప్తంగా చాటి చేసిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహాన్ని పుంగనూరులో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పడంతో ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

అన్న క్యాంటీన్‌కు ఏడాది పూర్తి

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 14: అన్న క్యాంటీన్ ప్రారంభించి ఏడాది పూర్తికావడంతో టీడీపీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. బుధవారం అన్న క్యాంటీన్‌లో పార్టీ నేతలు కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. స్థానిక కొంగారెడ్డిపల్లెలో టీడీపీ నేతలు, కార్యకర్తల సహకారంతో ప్రతి రోజు అన్నదానం చేస్తున్నారు. ప్రతి రోజు అన్నదానం చేస్తుండటంతో అన్నక్యాంటీన్ నిర్వాహకులను ప్రజలు అభినందిస్తున్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నేతలు కాజూరు బాలాజీ, కటారి హేమలత, గురజాల జగన్మోహన్, తేజస్విని, సీఆర్ రాజన్, రాజశేఖర్, కంద, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

చైతన్య పాఠశాలలో అక్షరాభ్యాసం



పలమనేరు, ఫిబ్రవరి14 : పలమనేరు చైతన్య పాఠశాలలో బుధవారం చదువుల తల్లి సరస్వతీ దేవి పుట్టిన రోజు సందర్భంగా పిల్లలచే అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా సరస్వతీదేవి చిత్రపటానికి వేదపండితులచే పూజలు నిర్వహించి అనంతరం పిల్లలచేత అక్షరాభ్యాసం చేయించారు. పిల్లల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి

చౌడేపల్లె, ఫిబ్రవరి14 : విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలని ఎంపీడీవో వెంకటేష్ పేర్కొన్నారు. బుధవారం ఎంపీపీ రామ్మూర్తి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ కుల గణన సర్వేలో కులం నమోదు చేస్తే మతం కూడా యాప్‌లో అనుసంధానం అవుతుందని, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, పజాప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఏవో జ్యోతి మాట్లాడుతూ.. రబీలో సాగు చేసిన పంటలను ఈ క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. పశువైద్యాధికారి పవన్‌కుమార్ మాట్లాడుతూ..గాలికుంటు వ్యాధికి టీకాలు పంపిణీ చేస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, ఎంఈవో కేశవరెడ్డి, డాక్టర్ పూజ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కాటిపేరి సచివాలయంలో చోరీ యత్నం

చౌడేపల్లె, ఫిబ్రవరి14 : కాటిపేరి సచివాలయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి యత్నం చేసినట్లు పంచాయతీ కార్యదర్శి జాకీర్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం సచివాలయం తాళాలు తీయటానికి రాగా బద్దలు కొట్టి ఉండటం గమనించి, వెంటనే లోపలకు వెళ్లి చూడగా రికార్డులు చింపి వస్తువులు చిందర వందరగా పడేసి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వస్తువులేవీ చోరీకి గురి కాలేదన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు.

చంద్రబాబును కలిసిన కుప్పం టీడీపీ నేతలు



కుప్పం, ఫిబ్రవరి 14: విజయవాడ ఉండవల్లిలో బుధవారం కుప్పం టీడీపీ నాయకులు పార్టీ అధినేత చంద్రబాబును కలిశారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, కాణిపాకం వెంకటేశ్ తదితరులు చంద్రబాబును కలిసి పార్టీ కార్యక్రమాల గురించి ఆయనకు వివరించారు. నిరంతరం జనాల్లో ఉంటూ పార్టీ సూపర్ సిక్స్ పథకాల గురించి విస్తృత ప్రచారం చేయాలని అధినేత వారికి సూచించారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు



కల్లూరు, ఫిబ్రవరి 14: పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉన్న జ్ఞాన సరస్వతీదేవి ఆలయంలో బుధవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకృతురాలైన అమ్మవారు భక్తులకు విశేషంగా దర్శనమిచ్చారు. ఉభయదారులుగా దామల్‌చెరువుకు చెందిన రాజేష్‌సింగ్ కుటుంబసభ్యులు వ్యవహరించారు.

టీడీపీ ఆర్థిక సాయం

రామకుప్పం, ఫిబ్రవరి 14: రామకుప్పం మండలం మిట్లపల్లెకు చెందిన నాగరాజు మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి వెంకటరమణ, పంచాయతీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, మాజీ సర్పంచు రామకృష్ణప్ప, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు తదితరులు బుధవారం నాగరాజు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులకు పార్టీ తరపున రూ.10వేలు సాయం అందజేశారు.

విద్యార్థి అదృశ్యం



పెద్దపంజాణి, ఫిబ్రవరి14: విద్యార్థి అదృశ్యమైన సంఘటన పెద్దపంజాణి మండలంలో చోటుచేసుకుంది. శంకర్రాయలపేట గ్రామానికి చెందిన సుజాత, సుబ్రమణ్యం కుమారుడు డి.చరణ్ అదే గ్రామంలోని పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం పాఠశాలకు వెళ్ళిన విద్యార్థి తిరిగి రాలేదు. స్నేహితులు, బంధువులను విచారించగా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామని తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసినవారు 9542347990 నెంబరుకు సమాచారం అందించాలని కోరుతున్నారు.

విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి

రొంపిచెర్ల, ఫిబ్రవరి 14: బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ కట్టకింద శివాలయం ఆవరణలో, వచ్చే రహదారిలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని పలువురు భక్తులు కోరారు. మాఘమాసం కావడంతో శివాయానికి వచ్చే భక్తుల తాకిడి ఎక్కువగా వుంటుందన్నారు. ఆలయ పరిధిలోని నాగరాళ్ల, ఆంజనేయస్వామి ఆలయాలకు వెళ్లి ప్రదక్షణలు చేయడం కష్టంగా ఉందని, ఆలయ కమిటీ చర్యలు తీసుకొని లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు.

మామిడి తోటకు నిప్పు



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి14: మండలంలోని మల్లుపల్లె సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో దాదాపు రూ. 20వేలు విలువ చేసే ఆస్తి నష్టం జరిగినట్లు అగ్నిమాపకాధికారి సుబ్బరాజు తెలిపారు. బుధవారం మామిడితోట కాలుతున్నట్లు రైతులు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసినట్లు ఆయన తెలిపారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

భక్తి ప్రపత్తులతో వసంత పంచమి


పొన్నియమ్మ గుడిలో చిన్నారులకు అక్షరాభ్యాసం

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 14: స్థానిక పొన్నియమ్మగుడిలో బుధవారం వసంత పంచమి వేడుకలు భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ఆలయంలో సరస్వతీదేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. జిల్లా వీహెచ్‌పీ కార్యదర్శి వి. వేలు ఆధ్వర్యంలో 1001 మంది చిన్నారులకు పలక, బలపాలు, నోటు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కేదారేశ్వరనాథన్, పి. రామూర్తి, మల్లీచారి తదితరులు పాల్గొన్నారు. గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో బాలవికాస్ విద్యార్థులచే సాంస్కృతిక ప్రదర్శనలు, సరస్వతీ దేవి పూజ, నామ సంకీర్తనలు నిర్వహించారు.

వెదురుకుప్పం: వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం సరస్వతీ దేవిని పూజించి, యజ్ఞయాగాది పూజలు నిర్వహించారు. మండలంలోని దేవళంపేట సోక్రటీస్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో పిల్లలకు శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసం చేయించారు. కరస్పాండెంట్ గుణశేఖర్, వైస్ ఛైర్మన్ హరీశ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు.

కల్యాణ మండపానికి శంకుస్థాపన


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కరుణాకర్‌రెడ్డి, రోజా

నగరి ఫిబ్రవరి 14: నగరి మండల పరిధిలోని బుగ్గలో గల శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి సమేత అన్నపూర్ణేశ్వరి ఆలయంలో బుధవారం రూ.2 కోట్లతో నిర్మించే కల్యాణ మండపానికి టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, మంత్రి ఆర్‌కే రోజా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మోహన్‌కృష్ణ, ఎంపీపీ భార్గవి, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనాలు ప్రారంభం

విజయపురం, ఫిబ్రవరి 14: మండలంలోని కాళికాపురంలో నూతనంగా నిర్మించిన ఆర్బీకే భవనం, ఇళ్ళత్తూరులో సచివాలయ భవనం, ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ కేంద్రాన్ని బుధవారం మంత్రి రోజా ప్రారంభించారు. అనంతరం విజయపురం ఎంపీడీవో కార్యాలయంలో నాలుగవ విడత ఆసరా చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో బ్రహ్మయ్య, ఏఈఈ వీరభద్రం, వైద్యాధికారి సోమశేఖర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు వెంకటమ్మ, మండల వైసీపీ అధ్యక్షుడు గోపీనాథ్, ఎంపీటీసీ సరళ, సర్పంచ్ గోపీరాజు, మురళీకృష్ణారెడ్డి, నాయకులు రమేశ్‌రెడ్డి, సురేశ్, పాండ్యన్, రమేశ్ ఆచారి, ప్రసన్నకుమార్, వెంకటేసులు తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లుగా తిరిగినా ఆరోగ్యశ్రీలో పేరు చేర్చలేదు


వినతిపత్రమిస్తున్న జగన్‌మోహన్

వెదురుకుప్పం, ఫిబ్రవరి 14: తన బిడ్డ పేరును ఆరోగ్యశ్రీలో రెండేళ్లుగా చేర్చలేదని తాజాగా బుధవారం జక్కిదొన గ్రామ సచివాలయంలో మళ్లీ వినతిపత్రమిచ్చామని బాధితుడు జగన్‌మోహన్ తెలిపారు. జక్కిదొన గ్రామ సచివాలయ పరిధిలో మునిరెడ్డిగారిపూరుకు చెందిన జగన్‌మోహన్ తన కుమారుడి పేరును ఆరోగ్యశ్రీలో చేర్చాలని రెండేళ్లుగా సచివాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ఇటీవల 1902కు ఫిర్యాదు చేశామన్నారు.

రైతులను దగా చేస్తున్న సీఎం జగన్

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 14: సీఎం జగన్ రైతు భరోసా పథకంతో రైతులను దగా చేస్తున్నారని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ అన్నారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రతి రైతు ఖాతాలో రూ.13500 వేస్తామని చెప్పిన జగన్ సీఎం అయిన తర్వాత కేవలం రూ.7500 మాత్రమే వేయడం రైతులను మోసం చేయడమేనని అన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీకి రైతులు తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

ఐరాల, ఫిబ్రవరి 14: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన బుధవారం ఐరాల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు పాటూరు సంతగేటుకు చెందిన ఖాదర్ బాషా(70) తన పని నిమిత్తం రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు - ఇద్దరికి తీవ్రగాయాలు

పాలసముద్రం, ఫిబ్రవరి 14: పళ్ళిపట్టు - షోలింగర్ రోడ్డుపై పాలసముద్రం మండలంలోని ఎస్‌ఆర్‌ఆర్ కండ్రిగ సమీపంలో బుధవారం కారు అదుపు తప్పి బైకును ఢీకొట్టింది. తమిళనాడులోని తిరుత్తణి ట్రాఫిక్ ఎస్‌ఐ రాజీకుమారి కథనం మేరకు షోలింగర్ నుంచి పళ్ళిపట్టుకు వెళ్తున్న కారు అతివేగంతో వెళుతూ ఎస్‌ఆర్‌ఆర్‌కండ్రిగ కూడలి ప్రాంతంలో అత్తిమంజేరిపేట నుంచి ఆర్కేపేటకు మోహన్, అతడి కుమారుడు కృష్ణ ద్విచక్రవాహనంలో వెళ్తుండగా అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ఘటనలో మోటర్ సైకిల్‌పై వెళ్తున్న తండ్రీ కొడుకులకు తీవ్రగాయాలయ్యాయి. వారిని తమిళనాడులోని తిరుత్తణి ప్రభుత్వాస్పత్రికి 108 వాహనంలో తరలించారు. కారులో వున్న వారిలో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. తిరుత్తణి ట్రాఫిక్ ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాత నేరస్థుల బైండోవర్

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 14: ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని 20 మంది పాత నేరస్థులను సీఐ నాగరాజరావు బుధవారం బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా వారికి తగు సూచనలు చేసి, తహసీల్దార్ సుభద్రమ్మ ఎదుట హాజరుపరిచారు. సొంతపూచీకత్తుపై వారిని విడుదలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ మల్లిఖార్జున్ పాల్గొన్నారు.


లైసెన్స్ లేకుండా వాహనం నడపడం చట్టరీత్యా నేరం

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 14: డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం చట్టరీత్యా నేరమని డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి కరుణకుమార్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కరుణకుమార్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలు పాటించడం వల్ల చాలావరకు రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో డీటీసీ నిరంజన్ రెడ్డి, ఆర్టీవో సునీల్ కుమార్, ఎంవీఐలు వాసుదేవ రెడ్డి, రాజేశ్వర్ రావు, మురళి, దీపిక, ఏఎంవీఐలు ప్రసాద్ వర్మ, భాగ్యశ్రీ, ఎస్సై రాజు తదితరులు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్యకు నివాళులు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 14: ఉమ్మడి రాష్ట్రంలో వృద్ధాప్య పెన్షన్ పథక రూపకర్త మాజీ సీఎం దామోదరం సంజీవయ్య అని జేసీ శ్రీనివాసులు అన్నారు. బుధవారం దామోదరం సంజీవయ్య జయంతి కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని స్పందన భవన్‌లో నిర్వహించారు. సంజీవయ్య చిత్రపటానికి జేసీ, పలువురు అధికారులు నివాళులర్పించారు. డ్వామా పీడీ రాజశేఖర్, జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరు


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 14: టీడీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు. బుధవారం నగరంలోని 16వ డివిజన్ దుర్గానగర్ కాలనీ, 35వ డివిజన్ గంగనపల్లి తదితర ప్రాంతాల్లో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో గడప గడపకు 'రా.. కదలిరా' కార్యక్రమం నిర్వహించారు. దొరబాబు మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యత ఇచ్చి రాష్ట్రాభివృద్ధికి కృషిచేశారని చెప్పారు. ఒక్క అవకాశం ఇవ్వాలని ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన జగన్ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నేతలు గురజాల జగన్మోహన్, కాజూరు బాలాజి, కటారి హేమలత, సీఆర్ రాజన్, తేజస్విని, గోపి, చిట్టి, బాబు, నిషాంత్, ఆనంద్, చంద్ర, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిలో వైసీపీ ప్రభుత్వం: గాలి భానుప్రకాష్


మాట్లాడుతున్న భానుప్రకాష్

నగరి, ఫిబ్రవరి 14: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం మానసిక ఒత్తిడిలో పిచ్చి పట్టినట్లు వ్యవహరిస్తోందని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ ఎద్దేవా చేశారు. బుధవారం నగరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర రాజధానిగా హైదరాబాద్ కావాలని అంటున్నారని, పక్కరాష్ట్రానికి చెందిన రాజధాని కావాలంటున్నారంటే నిజంగా వారికి పిచ్చిపట్టినట్లేనని పేర్కొన్నారు. మనకంటూ ఓ రాజధాని ఏర్పాటు చేసుకోకుండా ఇదెక్కడి ఆలోచన అని ఆయన విమర్శించారు. వైఎస్ షర్మిల చెట్టు పేరు చెప్పి కాయలమ్ముకుంటోందని మంత్రి రోజా విమర్శిస్తున్నారని, మరి జగన్ కింద మీరు చేస్తుంది కూడా అదే కదా అని అన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన ప్రభుత్వం రావడం తథ్యమని అన్నారు. నగరి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థికి తమ పూర్తి మద్దతు ఉంటుందని జనసేన నాయకుడు మెరుపుల మహేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 14: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 20న చిత్తూరు ఎస్వీసెట్‌లో జరిగే ప్రాంతీయ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్సీ భరత్‌లు కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో వారు జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎంపీ మాట్లాడుతూ జాబ్‌మేళాకు హాజరయ్యే యువతీ యువకులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ లింకులో నమోదు చేసుకోవాలన్నారు. ఆధార్‌కార్డు జిరాక్సు, బయోడేటా ఫారాలు, సర్టిఫికెట్ల జిరాక్సులను తీసుకురావాలని సూచించారు. ఐటీ సెక్టార్, బీపీవో, ఎలక్ట్రానిక్, మాన్యుఫాక్చరింగ్, రీటైల్ సెక్టార్లకు సంబంధించిన దాదాపు వందకు పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్యామ్‌మోహన్ రెడ్డి, గుణశేఖర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జేఈఈ ఫలితాల్లో శ్రీవివేకానంద విద్యార్థుల సత్తా


విద్యార్థులను అభినందిస్తున్న మహేంద్ర, భాస్కర్

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 14: జేఈఈ మెయిన్స్ ప్రకటించిన సెషన్ వన్ ఫలితాల్లో స్థానిక శ్రీవివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటినట్లు కరస్పాండెంట్లు మహేంద్రకుమార్, భాస్కర్ నాయుడు తెలిపారు. కళాశాలకు చెందిన ఎస్. సిద్ధార్థ్ 99.27 శాతం సాధించగా, ఎస్. నయాన 97.31, జి. భరద్వాజ్ 95.99, ఎం. మోనిషా 90.94, కె. తరుణ్‌కుమార్ 88.74, ఆర్. ఊహప్రియ 86.86, పి.ఎస్. కోటేంద్ర 85.71, డి. జాహ్నవి 83.57 శాతం సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధనకు కృషి చేసిన అధ్యాపకులను, విద్యార్థులను కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ రవి తదితరులు అభినందించారు.

బదిలీ అయినా పేరు మార్చరా...?



చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 14: జిల్లా దేవదాయశాఖలో అసిస్టెంట్ కమిషనరుగా పని చేస్తున్న ఏకాంబరం గత వారం పదోన్నతి పొంది చౌడేపల్లె బోయకొండ గంగమ్మ ఆలయానికి డిప్యూటీ కమిషనరుగా వెళ్లగా, నూతన అసిస్టెంట్ కమిషనరుగా ప్రసన్నలక్ష్మి వచ్చారు. బుధవారం నాటికి కూడా కార్యాలయంలోని దేవదాయ శాఖ సిబ్బంది నేమ్ బోర్డు, సమాచార హక్కు బోర్డులో పాత ఏసీ ఏకాంబరం పేరు మార్చకపోవడం గమనార్హం.

అన్న క్యాంటీన్‌కు ఏడాది పూర్తి


కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 14: అన్న క్యాంటీన్ ప్రారంభించి ఏడాది పూర్తికావడంతో టీడీపీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. బుధవారం అన్న క్యాంటీన్‌లో పార్టీ నేతలు కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. స్థానిక కొంగారెడ్డిపల్లెలో టీడీపీ నేతలు, కార్యకర్తల సహకారంతో ప్రతి రోజు అన్నదానం చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నేతలు కాజూరు బాలాజి, కటారి హేమలత, గురజాల జగన్మోహన్, తేజస్విని, సీఆర్ రాజన్, రాజశేఖర్, కంద, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకై ఉద్యోగుల నిరసన

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 14: దీర్ఘకాలిక డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఏపీ ఎన్జీవో జేఏసీ పిలుపు మేరకు విద్యాశాఖ సిబ్బంది బుధవారం డీఈవో కార్యాలయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా జేఏసీ నాయకులు మురళి మాట్లాడుతూ తమకు రావాల్సిన ఐఆర్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, సరెండర్ లీవు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నిరసన తెలిపిన వారిలో విద్యాశాఖ ఉద్యోగులు సత్యనారాయణ, రవిశేఖర్, రాము, గోపాల్, చైతన్య, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఐరాల: ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని కాణిపాకం జడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ నాయుడు, హెచ్‌ఎం చంద్రశేఖర్ నాయుడు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిత్తూరు రూరల్: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగులు డిమాండ్ చేశారు. స్థానిక వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం ఎదుట ఉద్యోగుల నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఉద్యోగుల సంఘ నాయకులు రాజేష్, దశరథం, సుధాకర్, సుబ్రమణ్యం, సీ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టండి

విజయపురం, ఫిబ్రవరి 14: ఓపీఎస్‌ను ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని జనసేన జిల్లా కార్యదర్శి స్వామినాథన్‌కు మండల ఉపాధ్యాయ సంఘం నేతలు బుధవారం విజయపురంలో వినతిపత్రం అందించారు. గత ఎన్నికల్లో సీపీఎస్‌ను రద్దు చేస్తామని అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని, ఓపీఎస్‌ను ప్రకటించే వారికే మా మద్దతు ఉంటుందన్నారు. ఈ విషయమై స్వామినాథన్ మాట్లాడుతూ రాష్ట్ర జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు నివేదిక పంపుతామన్నారు.

ఇంటింటి ప్రచారం

చిత్తూరు, ఫిబ్రవరి 14: ఆర్టీసీ వైస్ ఛైర్మన్, చిత్తూరు వైసీపీ సమన్వయకర్త విజయానందరెడ్డి బుధవారం నగరంలోని పలు వార్డుల్లో విస్తృతంగా ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. స్థానిక 46 నుంచి 50 డివిజన్ల పరిధిలోని సంతపేట సర్కిల్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించారు. కార్యక్రమంలో నగర మేయర్ అముద, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, వైసీపీ నాయకులు భూపేష్ గోపీనాథ్ పాల్గొన్నారు.

ఆసరా చెక్కు పంపిణీ

గుడిపాల, ఫిబ్రవరి 14: మండలంలోని గుడిపాల హైస్కూల్ ఆవరణలో బుధవారం జగనన్న ఆసరా కార్యక్రమంలో వైసీపీ సమన్వయకర్త విజయానందరెడ్డి పాల్గొని మహిళలకు రూ.6,67,85,000 చెక్కును పంపిణీ చేశారు. జడ్పీ వైస్‌ఛైర్‌పర్సన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్ రెడ్డి, ఏపీఎం సుధారాణి, సర్పంచ్‌లు రజనీకాంత్, మధుసూదన్ రాయల్, వైస్ ఎంపీపీ జయప్రియ, వెంకటేష్ రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు రూ.11.71 కోట్ల పంపిణీ

ఐరాల, ఫిబ్రవరి 14: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని స్వయం సహాయక సంఘాలకు బుధవారం పూతలపట్టు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త సునీల్‌కుమార్, ఎంపీపీ మోహన్, జడ్పీటీసీ సుచిత్ర రూ.11,71,690 చెక్కును పంపిణీ చేశారు. మండల వైసీపీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మహిళా, శిశు సంక్షేమ శాఖ రాయలసీమ రీజనల్ ఛైర్‌పర్సన్ శైలజ, నాయకులు సురేష్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి, చరణ్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహావిష్కరణ

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 14: గంగాధరనెల్లూరు ఎంపీడీవో కార్యాలయం ముందు వైస్ ఎంపీపీ హరిబాబు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని బుధవారం వైసీపీ నాయకులతో కలిసి డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనిత, వైసీపీ కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, గుణశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, దాముశెట్టి, కమలాకర్‌రెడ్డి, చెన్నమరెడ్డి, వేలుమొదలి, సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని ఆదరించండి

తవణంపల్లె, ఫిబ్రవరి 14: టీడీపీని ఆదరించి విజయానికి కృషిచేయాలని పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి మురళీమోహన్ అన్నారు. బుధవారం మండలంలోని కారకాంపల్లె, పల్లెచెరువు పంచాయతీల్లో ఇంటింటికి వెళ్లి బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలు పంపిణీ చేశారు. మురళీమోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరగాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. రానున్న ఎన్నికల్లో కలిసికట్టుగా టీడీపీ విజయానికి కృషిచేద్దామన్నారు. మండల టీడీపీ గౌరవ అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు, మండల అధ్యక్షుడు గాలి దిలీప్, నేతలు వెంకటేష్‌చౌదరి, భాస్కర్ నాయుడు, అమరేంద్ర నాయుడు, సునీల్‌చౌదరి, మధు, శివ, శరవణ, జెట్టిపల్లె శ్రీనువాసులు, రవిచంద్రారెడ్డి, సుధాకర్ నాయుడు, లోకనాథ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

16న భారత్ బంద్‌ను విజయవంతం చేయండి

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 14: ప్రధాని మోదీ అవలంభిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 16వ తేదీన జరిగే భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక గాంధీ విగ్రహం ఎదుట సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బీజేపీ నాయకులు ఎన్నికల హామీలను తుంగలో తొక్కారన్నారు. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణను ఆపాలని, భూహక్కుల 27/23ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు సురేంద్రన్, నాగరాజు, చైతన్య, రఘు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్యపై దృష్టి సారించండి - ఎంపీపీ దీప

నిండ్ర, ఫిబ్రవరి 14: వేసవిలో మండలంలోని గ్రామ పంచాయతీలలో తాగునీటి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులదేనని ఎంపీపీ దీప అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిండ్ర మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ మాట్లాడుతూ రాబోయే వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఎక్కడ కూడా తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. కోఆప్షన్ సభ్యులు అనిల్ మాట్లాడుతూ నిండ్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటలు వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. వైఎస్ ఎంపీపీ శుభ మాట్లాడుతూ నిండ్ర దళితవాడలో తాగునీటి బోరు, డ్రైనేజి ఏర్పాటు చేయాలన్నారు. కావనూరు ఎంపీటీసీ రాజేష్, తహసీల్దారు నాగమణి, ఎంపీడీవో భవాని, ఎంఈవో శ్రీధర్ రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అంజేరయ్య, ఏఓ తులసి, అత్తాలు సర్పంచ్ మలర్‌వాళీ, వైద్యాధికారిణి సుమలత, ఏపీవో ఇందుమతి, ఏపీఎం చంద్రకళ, హౌసింగ్ ఏఈ శ్రీధర్ రాజు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల వితరణ

నగరి, ఫిబ్రవరి 14: నగరి పట్టణ పరిధిలోని ఏకాంబరకుప్పం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రజనీకాంత్ బుధవారం భోజన ప్లేట్లను వితరణ చేశారు. 100 మంది విద్యార్థులు భోజనం చేయడానికి ప్లేట్లను వితరణ చేయడం అభినందనీయమని ఉపాధ్యాయులు రజనీకాంత్‌ను ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హరిదాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటరు దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించాలి

నగరి, ఫిబ్రవరి 14: ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపుల కోసం వచ్చిన దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించాలని ఆర్డీవో వెంకటరెడ్డి సూచించారు. నగరి మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆర్డీవో వెంకటరెడ్డి, మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఎల్వోల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఎల్వోలు, సూపర్‌వైజర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విజయపురం: ఓటరు క్లెయిమ్ పరిశీలనలో జాగ్రత్తలు పాటించాలని ఆర్డీవో వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలు, సూపర్‌వైజర్‌లతో సమావేశం నిర్వహించి ఫారం 6, 7, 8లను పరిశీలించారు. ప్రతిఫారంను నిశితంగా పరిశీలించాలని, పొరపాట్లు చేయకూడదని సూచించారు. తహసీల్దార్ మల్లికార్జునరావ్, డీటీ అశోక్, ఆర్‌ఐలు, వీఆర్వోలు, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల్లో పెండింగ్ పనులను పూర్తి చేయండి

చిత్తూరు, ఫిబ్రవరి 14: నగరపాలక సంస్థ పరిధిలోని పూనేపల్లె వద్ద నిర్మిస్తున్న టిడ్కో గృహ సముదాయాల్లో అసంపూర్తిగా ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని నగర కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె టిడ్కో గృహాల్లో పూర్తయిన పనులను పరిశీలించి, నీటి సరఫరా, ఇతర సౌకర్యాలను తనిఖీ చేశారు. హౌసింగ్ ఏఈ శ్రీధర్, టిడ్కో కన్సల్టెంట్ ధనంజయరెడ్డి, గుత్తేదారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్రగాయాలు

గుడిపాల, ఫిబ్రవరి 14: మండలంలోని చిత్తూరు-వేలూరు రహదారిలో అనుపు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. వేలూరుకు చెందిన సాయికుమార్ అతడి భార్య గోమతి చిత్తూరు నుంచి వేలూరు వైపు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా అనుపు వద్ద రోడ్డు గుంటల మయంగా ఉండటంతో అదుపుతప్పి కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 టెక్నికల్ అసిస్టెంట్ శివ చికిత్స నిమిత్తం వేలూరు సీఎంసీకి తరలించారు.

కారు ఢీకొని కూలీ మృతి


మృతిచెందిన శ్రీనివాసులు

పాకాల, ఫిబ్రవరి 14: పాకాల మండలం గాదంకి సమీపంలో బుధవారం రాత్రి కారు ఢీకొని ఓ కూలీ మృతిచెందాడు. మృతుడు ఐరాల మండలం పాటూరుకు చెందిన శ్రీనివాసులు(60)గా గుర్తించారు. మృతుడు గాదంకి సమీపంలో ఓ ఇసుకబట్టీలో పనిచేస్తున్నాడు. గాదంకి సమీపంలో రోడ్డు దాటుతుండగా బెంగుళూరు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందాడు. పాకాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీతోనే భవిష్యత్

నగరి, ఫిబ్రవరి 14: టీడీపీ ప్రభుత్వంతోనే రాష్ట్ర భవిష్యత్ సాధ్యమని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. బుధవారం నగరి ఎంపీడీఓ కార్యాలయ వీధిలో, చింతలపట్టెడలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. భానుప్రకాష్ ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.